క్లుప్తంగా

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ స్వాములు కొంతకాలంగా పక్షవాతంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి అలంపూర్ డ్రైవర్ల యూనియన్ సంఘం సభ్యులు స్వాములుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపల్లె దేవదాస్, అలంపూర్ డ్రైవర్ల యూనియన్ సంఘం అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నర్సింహ, సునిల్, క్యాషియర్ మర్దన్, సభ్యులు రవికుమార్, సుంకన్న, మన్సూర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి బంగారం వితరణ

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయానికి ధరూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీధర్ ఆలయానికి అరతులం బంగారాన్ని శనివారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వారిని శేషవస్త్రాలతో సన్మానించారు. ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులోని అభయాంజనేయ స్వామి 36 అడుగుల విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేసి, నవధాన్యాలతో, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాత నారాయణరెడ్డి, నాగలింగేశ్వరమ్మ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పొడవు శ్రీరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, శివానిరెడ్డి, దామోదర్ రెడ్డి, అజయ్‌రెడ్డి, శివారెడ్డి, శరణయ్య, చంద్రారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం



గద్వాల అర్బన్: ఎంఐఎం పార్టీ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంఐఎం పార్టీ అన్నివర్గాల వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇమాముద్దీన్, రఫీ, షఫీ, ఫరూక్ పాష, అంజాద్, నదీమ్ ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 7వ తేదీలోగా ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు ధ్రువపత్రాలతో జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08546–293022, 9908560268 నంబర్లకు, లేదా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

గద్వాల అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హలీమ్ పాష డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల నుంచి విద్యార్థినులు పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఒక వాహనంలో దాదాపు 30మంది వరకు వెళ్తూ ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారన్నారు. విద్యార్థినుల కోసం బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నవీద్ ఉన్నారు.

ఎస్‌ఐని సన్మానించిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: కోదండాపురం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన స్వాతిని శనివారం ఎర్రవల్లి మండలంలోని సాసనూలుకు చెందిన కాంగ్రెస్ నాయకులు పీఎస్‌లో పూలబొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గొంగళ్ల రాజు, బీసన్న, మధు, రాజు, రవి, నవీన్ ఉన్నారు.

పీహెచ్‌సీలో వసతులేవీ?



అయిజ పీహెచ్‌సీ భవనం

- పెచ్చులూడుతున్న భవనం
- శిథిలమైన ప్రహరి గోడలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మందుల గదిలో పెచ్చులూడిన పైకప్పు



స్టాఫ్ రూంలో పెచ్చులూడిపడిన పైకప్పు

అయిజ: జిల్లాలోనే అతిపెద్ద మండలం అయిజ. మున్సిపాలిటీలో కూడా రెండో పెద్ద పట్టణంగా ఉంది. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు లేకపోవడంతో పీహెచ్‌సీ సిబ్బంది, రోగులు అవస్థలకు గురవుతున్నారు. ఆరు పడకల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా సమస్యలు తిష్ట వేశాయి. గతంలో నిర్మించిన పీహెచ్‌సీ భవనం శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా పునర్ నిర్మాణం చేపట్టలేదు. దీంతో పీహెచ్‌సీ భవనంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అది అనేక సమస్యలను తెచ్చిపెడుతోంది. భవనం లోపలి భాగంలో పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. దాని వల్ల పీహెచ్‌సీ సిబ్బందితో పాటు, రోగులు భయబ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు ఇవేమీ పట్టనట్లు ఉండడంతో ప్రజల నుంచి అనేక విమర్శలు వస్తున్నాయి.

పీహెచ్‌సీలో రోగుల సంఖ్య ఎక్కువే..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రోజుకు సుమారు 150 నుంచి 200 మంది ఔట్ పేషెంట్లు, 15 నుంచి 20 మంది ఇన్ పేషెంట్లు వస్తుంటారు. పీహెచ్‌సీలో నెలకు 80 నుంచి 100 కాన్పులు అవుతుంటాయి. తెలంగాణలో 2015–16లో, 2023 సంవత్సరంలో అత్యధికంగా కాన్పులు చేయడంతో అయిజ పీహెచ్‌సీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించక రెండు సంవత్సరాలు అవుతున్నా ఉన్నత వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కు.ని ఆపరేషన్లు పీహెచ్‌సీలో నిర్వహించకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.10 నుంచి రూ.20 వేలు ఖర్చు చేసుకుంటున్నారు. పేదలు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కు.ని. ఆపరేషన్లు చేయించుకుంటున్నారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత..

అయిజ పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ (మహిళ) మాత్రమే విధుల్లో ఉన్నారు. వారితో పాటు చిన్న పిల్లల వైద్యుడు, ఇద్దరు ఎంపీహెచ్ఓలు ఉన్నారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సులు నలుగురు ఉండాలి, కానీ ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఒక సీనియర్ అసిస్టెంట్, కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్, కాంట్రాక్ట్ ఫార్మాసిస్ట్, పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. సుమారు 100 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. కు.ని. ఆపరేషన్లు నిర్వహించేందుకు ఏసీ థియేటర్ ఉంది. ఆపరేషన్ చేయడానికి కావాల్సిన పరికరాలన్ని ఉన్నాయి. కేవలం సర్జన్, మత్తు మందునిచ్చే డాక్టర్లు లేకపోవడంతో కు.ని. ఆపరేషన్లు చేయడం లేదు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది.

దవాఖానలో ఆపరేషన్ చేస్తలేరు



ఇంతపెద్ద సర్కారు దవాఖానలో పిల్లలు కాకుండా చేసే ఆపరేషన్లు చేస్తలేరు. ఆపరేషన్లు చేయించుకోవడానికి గద్వాలకు పోవాల్సి వస్తోంది. అక్కడికి పోవడానికి బాలింతలు అవస్థలు పడుతున్నారు. డబ్బున్న వారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. డబ్బులేని వారు గద్వాలకు పోవాలంటే బాలింతలకు ఇబ్బందిగా ఉంటోంది. ఆపరేషన్లు ఇక్కడనే చేస్తే బాగుంటది.

– వెంకటమ్మ, అయిజ

పెచ్చులూడిపడుతున్నాయి..



ప్రభుత్వ దవాఖాన భవనం శిథిలమైంది. పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఆస్పత్రిలో పని చేసే సిబ్బందితో పాటు ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. పీహెచ్‌సీ భవనానికి గతంలో మరమ్మతులు చేయించినా ఫలితం లేదు. మరోసారి మరమ్మతులు చేయించాలి. అవసరమైతే ఆస్పత్రి భవనాన్ని పునర్ నిర్మించాలి.

– వెంకటేష్, అయిజ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

పీహెసీలో పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. సిబ్బందితో పాటు, చికిత్సకోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఉన్నతాధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో సమస్యలపై గతంలో పని చేసిన మెడికల్ ఆఫీసర్లు సైతం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మళ్లీ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మానస, కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్

శివ నామస్మరణతో శ్రీశైలానికి స్వాములు



ఉండవెల్లిలోని ఇరుమడి ధరిస్తున్న స్వాములు



కాలినడకన శ్రీశైలానికి బయలు దేరిన భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శివ స్వాములు శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సరస్వతి అమ్మవారి ఆలయంలో ఇరుముడులు ధరించారు. వెంకటాపురానికి వెళ్లి అక్కడి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేస్తారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

అయిజ: మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన శివభక్తులు శనివారం శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి శ్రీశైలానికి కాలినడకన బయలు దేరారు. ఈ సందర్భంగా గ్రామంలో పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీశైలానికి బయలుదేరిన వాళ్లలో సూర్యనారాయణ, సంజన్న, రంగస్వామి, శ్రీనివాసులు, శంకరన్న, రామలింగం, వెంట్రాములు, జగదీష్, నరసింహులు, గోవిందు, వీరేష్ పాల్గొన్నారు.

శాంతినగర్: శివస్వాముల ఇరుముడి కార్యక్రమం కొంకలలో శివనామస్మరణలు మార్మోగింది. కొంకల నుంచి శివస్వాములు జ్యోతిర్ముడి కట్టుకుని శ్రీశైలానికి బయల్దేరారు. ఆలయ ప్రాంగణంలో ఇరుముడి కార్యక్రమం కనులపండువగా కొనసాగింది. ఈ సందర్భంగా శివస్వాముల కుటుంబ సభ్యులు, గ్రామప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బల్గెర శివాలయంలో మెట్ల పూజ

గట్టు: మండలంలోని బల్గెర శివాలయంలో శనివారం శివమాల ధరించిన స్వాములు మెట్లపూజ నిర్వహించారు. జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతు నాయుడు, శివ మాలదారులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



రాఘవేంద్ర పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె రాఘవేంద్ర పాఠశాలలో శనివారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు వెంకటేష్, అంజలి, స్వర్ణలత, నవిత, శిరీష, తదితరులు ఉన్నారు.

మద్దెలబండలో స్వపరిపాలన దినోత్సవం



మద్దెలబండలో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మల్దకల్: మండలంలోని మద్దెలబండ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప, ఉపాధ్యాయులు తిమ్మప్ప, శైలజ, సంగీత, కవిత, విజిత పాల్గొన్నారు.

ఆడ, మగ సమానమనే భావనతో పెంచాలి



గట్టులో మాట్లాడుతున్న సీడీపీఓ

గట్టు: మహిళలు కుటుంబం నుంచే అమ్మాయిలు, అబ్బాయిలు సమానమనే భావనతోనే పిల్లలను పెంచాలని, ఆరోగ్యం, క్రమ శిక్షణ, పెద్దలను గౌరవించడం, కుటుంబ విలువలపై పిల్లలకు నేర్పించాలని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవీ కోరారు. శనివారం గట్టు గ్రామ పంచాయతీలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, బాలికల సాధికారత కోసం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ కమలాదేవి మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాల్లో ముందుకు వెళ్తున్నారని, మగవారితో సమానంగా ఉన్నప్పటికీ మరో రకంగా హింసకు గురౌతున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మహిళల పట్ల హింస ఆగడం లేదన్నారు. చట్టాలను మరింత కఠినతరం చేస్తే, హింస ఆగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సఖి కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ హింసకు గురౌతున్న మహిళలు సఖి కేంద్రానికి సమాచారం అందిస్తే, అండగా నిలబడతామని తెలిపారు. మహిళలు వేధింపు, హింసకు ఉగరౌతున్న వారు 181కు సమాచారం ఇవ్వాలని కోరారు. సఖి కేంద్రం ద్వారా న్యాయ సలహాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ చిట్టెమ్మ, ఐసీపీ లక్ష్మీదేవి, సఖి సీఏ కవిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రామమ్మ, సుజాతమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

తండ్రి ఆశయం నెరవేర్చిన కూతురు

భర్త సహకారంతో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



ఇంద్రజ్యోతి

మానవపాడు: తండ్రి ఆశయాన్ని కూతురు నెరవేర్చింది. చిన్ననాటి నుంచి తండ్రి కలలు గన్న లక్ష్యాని కూతురు కృషి, పట్టుదల, సంకల్పబలంతో ఉన్నత చదువులు చదివి ప్రభుత్వంలో ఉద్యోగం సాధించింది. భర్త జగదీష్ సహకారంతో తండ్రి ఆశయాన్ని నెరవేర్చింది. ప్రభుత్వ ఉద్యోగాలలో మూడు ఉద్యోగాలు సాధించి గ్రామాల్లోని పలువురికి ఆదర్శంగా నిలిచింది. మండలంలోని చెన్నిపాడుకు చెందిన ఇంద్రజ్యోతి భర్త జగదీష్ సహకారంతో పీఎచ్‌డీ చదువుతూ కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఆమె 10వ తరగతి వరకు బాలికల ఉన్నత పాఠశాల గద్వాల, ఇంటర్ మానవపాడు, డిగ్రీ కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కర్నూల్, పీజీ సెంటర్ గద్వాల, పీఎచ్‌డీ పాలమూర్ యూనివర్సిటీ పాలమూర్ జిల్లా కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తోంది. ఇటీవల వెలువడిన ప్రభుత్వ ఉద్యోగాలు మూడు సాధించింది. డిగ్రీ లెక్చరర్, ఇంటర్ లెక్చరర్, టీజీటీలకు ఎంపికైంది. ఆమె ప్రభుత్వంలో మూడు ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోగ నిరోధక టీకాలు వేయించండి



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ రాకుండా రోగనిరోధక టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తోందని తెలిపారు. శనివారం మండలంలోని దేవబండలో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. మొత్తం 38 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలున్నా పశు వైద్యశాలలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ఓపెన్ కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

అయిజ: మండల కేంద్రంలో తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా శనివారం ఓపెన్ కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు ప్రకటించారు. కబడ్డీ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. రాత్రి తిక్క వీరేశ్వరస్వామి ఆలయంలో అంతర్రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.9 వేలు, ఐదో బహుమతి రూ.8 వేలు ఆరో బహుమతి రూ.7 వేలు, ఏడో బహుమతి రూ.6వేలు, ఎనిమిదో బహమతి రూ.5 వేలు, తొమ్మిదో బహుమతి రూ.4 వేలు, పదో బహుమతి రూ.3వేలు, 11వ బహుమతి రూ.2వేలు, 12వ బహుమతి రూ.వెయ్యి నగదు బహుమతులుగా ప్రకటించారు.

ఆర్డీఓకు ఘన సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శనివారం గద్వాల ఆర్డీఓ రాంచందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, ఎన్నారై పోతురాజు సోమనాద్రి సేవాదళం సభ్యులతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. గతంలో గద్వాల ఆర్డీఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఆర్డీఓ చంద్రకళను పూలబొకే, శాలువాతో సత్కరించారు.

పల్స్‌పోలియోపై ర్యాలీ



మానవపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: పల్స్‌పోలియో కార్యక్రమంపై డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో పూర వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆదివారం మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ 0–5 సంవత్సరాలు నిండిన పిల్లలకు తప్పక పోలియో నివారణ చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



గట్టు ఆస్పత్రిలో సిద్ధం చేసిన వ్యాక్సిన్ బాక్సులు

గట్టు: పల్స్‌పోలియోకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వైద్యాధికారి రమేష్ తెలిపారు. శనివారం గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియోపై సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు వేసే వ్యాక్సిన్లకు సంబంధించిన బాక్స్‌లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని కోరారు. మండలంలో 57 కేంద్రాలు, రెండు మొబైల్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్స్‌పోలియో సందర్భంగా గట్టులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ఉస్సేన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమికొడుదాం

అయిజ: ఆదివారం నుంచి ప్రారంభమయ్యే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేసి పోలియో మహమ్మారిని తరిమికొడుదామని ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు వైద్య సిబ్బందితో పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూర్: సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, ఏఎస్ఐ బీచుపల్లి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మోట్లంపల్లిలో గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈమధ్యకాలంలో ప్రేమ, పెళ్లి పేరిట బాలికలను తప్పుదోవ పట్టిస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలతో బాధ్యాతయుతంగా మెలగాలన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి లాటరీల్లో డబ్బులు వచ్చాయని, బహుమతులు గెలుచుకున్నారని పలురకాల ఫోన్ కాల్స్ వస్తుంటాయని, వాటితో జాగ్రతగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్తులందరూ కలసిమెలసి ఉంటామని ప్రమాణం చేశారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



గట్టు: మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్–2 పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో మొత్తం 323 మంది విద్యార్థులకు గాను 322 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్ తెలిపారు.

మల్దకల్‌లో ఇంటర్ పరీక్షలు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. పరీక్ష కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయాలని సూచించారు. మొత్తం 61మంది విద్యార్థులకు గాను 59మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణలు తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మల్దకల్: మండలంలోని మంగంపేటలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పెద్దపల్లి రాజశేఖర్‌రెడ్డి, గోపాల్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఆంజనేయులు, గోవర్ధన్, రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలు సాధించిన తుమ్మిళ్ల యువకుడు



సుధాకర్

రాజోళి: మండలంలోని తుమ్మిళ్లకు చెందిన యువకుడు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గ్రామానికి చెందిన సుజ్ఞానం, పార్వతమ్మల కుమారుడు సుధాకర్ పాలమూరు యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చదువుతున్నాడు. ఇటీవల టీఆర్‌ఐఈబీ విడుదల చేసిన ఫలితాల్లో జేఎల్‌గా, టీజీటీ జనరల్ సైన్స్‌లో, టీజీటీ బయోలాజికల్ సైన్స్‌లో ఏకకాలంలో ఉద్యోగాలు సాధించాడు. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తనకు సంతోషంగా ఉందని, అమ్మానాన్నల సహకారంతోనే ఇలాంటి విజయాన్ని అందుకున్నట్లు సుధాకర్ తెలిపారు. మూడు ఉద్యోగాలు సాధించిన అతన్ని మిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఆలయానికి ఇన్వర్టర్ అందజేత

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో కొలువైన భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయానికి శనివారం సత్యం స్కూల్ యాజమాన్యం ఇన్వర్టర్ అందజేశారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌రెడ్డి, జయలక్ష్మి దంపతులు రూ.20వేల విలువైన ఇన్వర్టర్‌ను ఆలయానికి అందించారు. ఆలయంలో ప్రతి రోజు పూజలు, రానున్న శివరాత్రిని పురస్కరించుకుని ఈ ఇన్వర్టర్ వల్ల ఆలయంలో భక్తులకు ఇబ్బందులు ఉండవని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.